క్లుప్తంగా

తిరుపతిరావు విజయానికి ఐక్యంగా కృషి చేయాలి



మైలవరం: వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు గెలుపునకు బీసీలు ఐక్యంగా కృషి చేయాలని బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నిడుముక్కల శివ శంకరరావు అన్నారు. మైలవరంలో నాయీ బ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి క్యాలెండర్‌ను వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు శనివారం ఆవిష్కరించి మాట్లాడారు. ఎమ్మెల్యేగా సర్నాల తిరుపతిరావు, విజయవాడ ఎంపీగా కేశినేని శ్రీనివాస్‌ను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మల్కాపురం కనకారావు, సీనియర్ నాయకులు జమలాపురం రాంబాబు, వృత్తిదారుల కన్వీనర్ రాయవరపు గణపతి, యువజన విభాగం అధ్యక్షులు కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం స్ట్రాంగ్‌రూం పరిశీలన



తిరువూరు: తిరువూరు నియోజకవర్గంలో మే 13న జరుగనున్న ఎన్నికలకు వినియోగించనున్న ఈవీఎంలను భద్రపరిచిన జెడ్పీ బాలికోన్నత పాఠశాలలోని స్ట్రాంగ్‌రూంను ఎన్టీఆర్ జిల్లా పోలీస్ అసిస్టెంట్ కమిషనర్ మురళీమోహన్ శనివారం పరిశీలించారు. పోలింగ్ ముగిసే వరకు స్ట్రాంగ్‌రూం వద్ద నిరంతర నిఘా ఉంచాలని ఏసీపీ ఆదేశించారు. అపరిచిత వ్యక్తులు, పాత నేరస్తులు ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తుంటే అదుపులోకి తీసుకోవాలని ఆదేశాలిచ్చారు. సిబ్బంది విధి నిర్వహణకు సంబంధించిన చార్టులను తనిఖీ చేశారు. తిరువూరు సెక్టార్-1 ఎస్ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

29న నామినేషన్ల ఉపసంహరణ

నూజివీడు: ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈనెల 29న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ వై భవానిశంకరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ ఉపసంహరణ పత్రాలను మధ్యాహ్నం 3 గంటలలోగా సమర్పించాలని పేర్కొన్నారు. అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తామని తెలిపారు.

రోడ్డు మలుపుల్లో స్టాపర్ల ఏర్పాటు



చాట్రాయి: రోడ్డు ప్రమాదాల నివారణకు స్టాపర్లు దోహదపడతాయని ఎస్ఐ స్వామి అన్నారు. శనివారం మండలంలోని చనుబండ, సత్తుపల్లి మెయిన్ రోడ్డుపై స్టాపర్లను ఏర్పాటుచేశారు. నిత్యం భారీ వాహనాల రాకపోకలతో రద్దీగా ఉన్న సత్తుపల్లి, విజయవాడ రోడ్డుపై ప్రమాదాల నివారణకు రోడ్డు మలుపుల వద్ద స్టాపర్లు ఏర్పాటు చేశామని వివరించారు.

మేడే ఉత్సవాలకు అనుమతి ఇవ్వాలని వినతి

నూజివీడు: మే ఒకటో తేదీన మేడే ఉత్సవాల నిర్వహణకు అనుమతివ్వాలని సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు శనివారం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ వై.భవానీశంకరికి వినతి పత్రం అందజేశారు. సీపీఎం నాయకులు జి.రాజు, సీపీఐ నాయకులు చాట్ల పుల్లారావు ఆర్డీఓను కలిసి కార్మికులందరూ ఏడాదికి ఒకసారి మేడే నిర్వహిస్తారని, కార్మిక దినోత్సవాన్ని శాంతియుతంగా నిర్వహించుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు.

నేటి నుంచి ఓటరు స్లిప్పుల పంపిణీ

తిరువూరు: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్లకు స్లిప్పులను ఆదివారం నుంచి పంపిణీ చేస్తామని తిరువూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి మాధవి తెలిపారు. మే 13న జరిగే పోలింగ్‌లో ఓటు హక్కును వినియోగించుకునే ఓటర్లకు వారి పోలింగ్ కేంద్రం, ఓటర్ల జాబితాలో సీరియల్ నెంబర్ తదితర వివరాలను ఈ ఓటరు స్లిప్పులో పొందుపరిచామన్నారు. బీఎల్‌ఓలు ఈ స్లిప్పులను ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు అందజేస్తారని చెప్పారు.

బీఎల్‌ఓల ద్వారా..

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలంలోని ఓటర్లకు బూత్ స్థాయి అధికారుల ద్వారా ఓటరు స్లిప్పుల పంపిణీ చేస్తామని అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎ.శ్రీరమ్య తెలిపారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో బీఎల్వోలతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

ప్రతి కుటుంబానికి లబ్ధి



పోలిశెట్టిపాడులో ప్రచారం చేస్తున్న నల్లగట్ల స్వామిదాసు



తిరువూరు 5వ వార్డులో ప్రచారం చేస్తున్న సుధారాణి

తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి స్వామిదాసు

ఎ.కొండూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హత గల ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందని వైఎస్సార్ సీపీ తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. మండలంలోని వల్లంపట్ల, జీళ్లకుంట, పోలిశెట్టిపాడు, మారేపల్లి గ్రామాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డప్పు వాయిద్యాలతో గ్రామస్తులు స్వాగతం పలికారు. స్వామిదాసు మాట్లాడుతూ వైఎస్ జగన్ పేద ప్రజలకు ఇస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ప్రజలంతా వైఎస్సార్‌సీపీ వైపు ఉన్నారని చెప్పారు. చెప్పిందే చేస్తారని, చేయగలిగిందే చెబుతారని మేనిఫెస్టో ద్వారా మరోసారి రుజువు చేశారని తెలిపారు. సూపర్ సిక్స్ అంటూ అమలు కాని హామీలతో చంద్రబాబు మరోసారి మోసం చేసేందుకు వస్తున్నారని, ఆయన మాటలను ప్రజలు నమ్మేపరిస్థితి లేదని చెప్పారు. పేదలకు మేలు చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోసం మీరంతా సైనికుల్లా పనిచేయాలని, ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కేశినేని శ్రీనివాస్ (నాని)ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు నరెడ్ల వీరారెడ్డి, జెడ్పీటీసీ భూక్య గనియా, పీఏసీఎస్ అధ్యక్షుడు టి. వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ జి. శివారెడ్డి, సర్పంచులు జూపల్లి రాజేష్, కె. శ్రీను, ఎంపీటీసీ ఎ. జానకీ, నాయకులు ఎ. రామ్మోహన్‌రెడ్డి, టి. జగన్‌మోహన్‌రెడ్డి, బి. శ్రీను, ఎం. రవి పాల్గొన్నారు.

సంక్షేమాన్ని కొనసాగిస్తూ సీపీ మేనిఫెస్టో

తిరువూరు: ఎన్నికల్లో కల్లబొల్లి వాగ్దానాలు చేసి ఓట్లు దండుకునే రాజకీయాలకు స్వస్తి పలికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేయదగిన మేరకే మేనిఫెస్టోలో ప్రకటించారని కృష్ణా జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి అన్నారు. శనివారం తిరువూరు పట్టణంలోని 5వ వార్డులో వైఎస్సార్ సీపీ అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసుకు మద్దతుగా ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఆమె మాట్లాడుతూ గతంలో ఉన్న అన్ని పథకాలనూ మరింత సమర్థవంతంగా అమలు చేస్తూ, ఇంకా అర్హులందరికీ అందజేయాలనే తపనతో సీఎం మేనిఫెస్టో ప్రకటించారన్నారు. పక్క రాష్ట్రాల మేనిఫెస్టోలు కాపీ కొట్టిన తెలుగుదేశం పార్టీ అలవి కాని వాగ్దానాలతో ప్రజల్ని మరోసారి మోసం చేయాలని చూస్తోందని విమర్శించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ, నగర పంచాయతీ వైస్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

పేదల పెన్నిధి సీఎం వైఎస్ జగన్

మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి తిరుపతిరావు



గుర్రాజుపాలెంలో తిరుపతిరావుకు హారతి ఇచ్చి తిలకం దిద్దుతున్న వృద్ధురాలు

జి.కొండూరు: ఐదేళ్ల పాలనలో పేద ప్రజల ఆర్థిక, సామాజిక, రాజకీయ ఎదుగుదలకు కృషి చేసిన జగనన్న, తన మేనిఫెస్టో ప్రకటనతో మరోసారి పేదల పెన్నిధి అని నిరూపించుకున్నారని వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు అన్నారు. జి.కొండూరు మండల పరిధి గుర్రాజుపాలెం, వెంకటాపురం, చెవుటూరు, పినపాక, కట్టుబడిపాలెం గ్రామాల్లో సర్నాల తిరుపతిరావు శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాలలో పార్టీ శ్రేణుల నుంచి సర్నాల తిరుపతిరావుకి ఘనస్వాగతం లభించింది. తిరుపతిరావు మాట్లాడుతూ ఖచ్చితంగా అమలు చేసే హామీలనే జగనన్న మేనిఫెస్టోలో చెప్పారన్నారు. ఐదేళ్ల పాలనలో 99 శాతం హామీలను అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. అలవికాని హామీలతో వస్తున్న పసుపు దండుని ఓటు అనే ఆయుధంతో తరిమికొట్టాలని ప్రజలను కోరారు. ఐదేళ్ల పాటు నియోజకవర్గంలో సహజ వనరుల దోపిడీకి పాల్పడిన వసంత వెంకట కృష్ణప్రసాద్ నేడు నీతులు చెబితే నియోజకవర్గ ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. డబ్బు అహంకారంతో ఎన్నికలలో గెలవాలని అవకాశం ఉన్న ప్రతి అడ్డదారి తొక్కుతున్నాడని విమర్శించారు. ఎన్ని కుట్రలు చేసినా జగనన్నపై ఉన్న ప్రజాభిమానమే తనని గెలిపిస్తుందని తిరుపతిరావు ధీమా వ్యక్తం చేశారు.

వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోపై సర్వత్రా హర్షం

తిరువూరు/మైలవరం/నూజివీడు: వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండు పేజీలతో 9 ముఖ్యమైన హామీలతో విడుదల చేసిన మేనిఫెస్టో అన్నివర్గాలకు మేలు చేకూర్చేలా ఉందని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. సంక్షేమ పథకాలు కొనసాగింపు.. విస్తరణతో పాటు పెన్షన్లు రూ.3,500లకు పెంపు చేయడంపై హర్షం వ్యక్తంచేస్తున్నారు. గత మేనిఫెస్టోకంటే గొప్పగా 2024 మేనిఫెస్టోను సీఎం జగన్ ప్రకటించారని పేర్కొంటున్నారు.

గతానికన్నా మిన్నగా..



అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో ఉంది. గతానికన్నా మరింత సంక్షేమం, అభివృద్ధి దిశగా నిలుస్తోంది. ప్రతి పథకం వెనుక పేదల సంక్షేమం కనిపిస్తోంది. అన్నివర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని మేనిఫెస్టో రూపొందించడం సీఎం వైఎస్ జగన్‌కే సాధ్యం. సూపర్ సిక్స్ అంటూ మోసపూరిత హామీలతో ప్రజలను తప్పుదోవ పట్టించి మళ్లీ అధికారంలోకి రావడానికి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. చంద్రబాబు మాటలు నమ్మే స్థితిలో ప్రజలు లేరు. మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు.

–జ్యేష్ఠ రమేష్‌బాబు, మైలవరం మాజీ ఎమ్మెల్యే

డ్రైవర్ల కష్టాలు తెలిసిన నేత జగన్



30 ఏళ్లుగా ఆటో తోలుకుంటూ జీవనం సాగిస్తున్నా. ఏ ఒక్క ప్రభుత్వం మా కష్టాలను పట్టించుకోలేదు. జగనన్న సీఎం అయిన తర్వాత వైఎస్సార్ వాహన మిత్ర ద్వారా ఐదేళ్లలో రూ.50 వేలతో వాహనం మరమ్మతులు చేయించుకుని, ఇన్సూరెన్స్ చేయించుకున్నా. ఇన్సూరెన్స్ భారం మాపై లేకుండా చూసుకున్నారు. 2024 మేనిఫెస్టోలో మా ఆటో, ట్యాక్సీలను కొత్తగా కొనుగోలు చేసేందుకు బ్యాంకు లోను తీసుకునే వారి కోసం 6 శాతం కంటే అదనపు వడ్డీని ప్రభుత్వమే భరిస్తాననడం పేదవర్గాలకు ఎంతో ఉపయోగం. ప్రమాదవశాత్తు మరణించిన వారికి రూ.10 లక్షల బీమా ఇస్తానని జగనన్న మాకు ఇచ్చిన భరోసా ఆనందంగా ఉంది.

– గరిసేపల్లి శ్రీనివాసరావు, ఆటో డ్రైవర్, ఆగిరిపల్లి

పేదలకు వరం



2019లో ప్రకటించిన వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోలో అన్ని హామీలను నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ 2024 ఎన్నికలకు మరింత మెరుగైన మేనిఫెస్టోను ప్రకటించడం హర్షణీయం. పేదల కష్టాలు తెలిసిన ముఖ్యమంత్రి వారి జీవితాలను బాగుచేయడానికి గతంలో ఉన్న అన్ని పథకాలనూ సమర్థవంతంగా అమలు చేయడానికే ప్రాధాన్యత ఇచ్చారు. టీడీపీ అధినేత చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలు గాలిబుడగలని జనం గుర్తించారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీకే ప్రజలు అఖండ విజయం చేకూరుస్తారు.

–షేక్ జాకీర్ హుసేన్, తిరువూరు

అన్నివర్గాలకు మేలు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలో వ్యవసాయం, విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. అమ్మ ఒడిని రూ.17 వేలకు, రైతు భరోసాను రూ.16 వేలకు పెంచారు. వైద్య కళాశాలలు, నర్సింగ్ కళాశాలల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇచ్చారు. చిరువ్యాపారులకు రుణ పరిమితిని రూ.10 వేల నుంచి రూ.15 వేలకు పెంచడం వల్ల మేలు కలుగుతుంది. పింఛన్ల సొమ్ము రూ.3,500 వరకు పెంచడం కూడా అభినందనీయం.

– కంభాల దాసు, కాట్రేనిపాడు, ముసునూరు మండలం

మేలు చేసే జగనన్నను మళ్లీ సీఎంను చేయాలి

- వైఎస్సార్ సీపీ అభ్యర్థులు మేకా ప్రతాప్, కారుమూరి సునీల్ కుమార్ యాదవ్
- ముసునూరు, చింతలవల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం



ప్రచారం చేస్తున్న మేకా ప్రతాప్ అప్పారావు, కారుమూరి సునీల్‌కుమార్

ముసునూరు: ప్రజలకు నిరంతరం మేలు చేసే జగనన్న ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలని వైఎస్సార్ సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ కోరారు. పార్టీ మండల, యూత్ అధ్యక్షులు నాగవల్లేశ్వరరావు, గూట్రు రంగారావుల ఆధ్వర్యంలో ముసునూరు, చింతలవల్లి, గోగులంపాడు గ్రామాల్లో శనివారం రాత్రి వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అద్భుతమైన మేనిఫెస్టో రూపొందించిన జగనన్నకు మళ్లీ పట్టం కట్టాలని వారు కోరారు. జగనన్న నేతృత్వంలో నూజివీడు నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని వనరులు తెచ్చి, సమగ్ర అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. దళితవాడల్లో కాలినడకన తిరుగుతూ పెద్దలను, మహిళలను కలిసి ఓట్లు అభ్యర్థించారు. చింతలపూడికి, తోటపల్లికి తేడా తెలియని వ్యక్తి మాటలు నమ్మవద్దని కోరారు. ముసునూరు, చింతలవల్లి గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, వాటర్ ఓవర్ హెడ్ ట్యాంకులు, పైపు లైన్లు, అంతర్గత సీసీ రహదారులు, ధాన్యం గోదాములు, జగనన్న కాలనీలు నిర్మించి, గ్రామాలను అభివృద్ధి చేశామని వివరించారు. బాణసంచాతో స్థానిక యువకులు, జగనన్న పాటలకు ఏలూరుకు చెందిన యువకులు డ్యాన్సులు చేశారు.

ప్రచార ర్యాలీ ఆద్యంతం సందడిగా మారింది. కార్యక్రమాల్లో నూజివీడు మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ కంభాల కృష్ణవేణి, వైస్ చైర్మన్ బర్మా సీతారామయ్య, జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీలు రాజా నాయన, గంగాధర్, స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ స్వరూపరాణి, స్థానిక సర్పంచ్ సత్యనారాయణ, ఎంపీటీసీ సుధాకర్, సొసైటీ అధ్యక్షుడు నాగళ్ల వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్‌లు గోపాలకృష్ణ, కుటుంబరావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు సుబ్బారావు, జిల్లా పార్టీ నేతలు రమేష్, అనిల్, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మైలవరంలో మహిళా ఓటర్లే అధికం

- మొత్తం ఓటర్ల సంఖ్య 2.81లక్షలు
- పురుష ఓటర్ల సంఖ్య 1.36 లక్షలు
- మహిళా ఓటర్ల సంఖ్య 1.44 లక్షలు

మైలవరం: మైలవరం నియోజవర్గంలో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. వీరి ఓట్లే కీలకం కానున్నాయి. ఇబ్రహీంపట్నం, జి.కొండూరు, మైలవరం, రెడ్డిగూడెం, విజయవాడ రూరల్ మండలాల్లో మొత్తం 2,81,732 మంది ఓటర్లు ఉన్నారని నియోజకవర్గ ఎన్నికల అధికారి శనివారం తెలిపారు. వీరిలో పురుషులు 1,36,740, మహిళలు 1,44,972, ఇతరులు 20 మంది ఉన్నారు. కాగా రెడ్డిగూడెం మండలంలో పురుషులు 19,202 మంది, మహిళలు 19,326, ఇతరులు 0, మొత్తం 38,528 ఓటర్లు ఉన్నారు. మైలవరం మండలంలో పురుషులు 26,481, మహిళలు 27,777, ఇతరులు ఇద్దరు, మొత్తం 54,260 మంది ఉన్నారు. జి.కొండూరు మండలంలో పురుషులు 23,221, మహిళలు 24,516, ఇతరులు ఒకరు, మొత్తం 47,738 మంది ఓటర్లు ఉన్నారు. కొండపల్లిలో పురుషులు 24,869, మహిళలు 27,106, ఇతరులు 05, మొత్తం 51,980 మంది, ఇబ్రహీంపట్నంలో పురుషులు 16,003, మహిళలు 17,273, ఇతరులు ఇద్దరు, మొత్తం 33,279 మంది, విజయవాడ రూరల్‌లో పురుషులు 26,964, మహిళలు 28,974, ఇతరులు 10, మొత్తం 55,948 మంది ఓటర్లు ఉన్నారు. కాగా 2019లో మొత్తం ఓటర్లు 2,75,000 మంది ఉండగా వీరిలో పురుషులు 1,30,189, మహిళలు 1,32,848 మంది, ఇతరులు 18 మంది ఉన్నారు. 2024కు 6,732 మంది ఓటర్లు పెరిగారు.

తిరుపతిరావుకు మద్దతుగా ప్రచారం



కరపత్రాలు పంచి ఓట్లు అభ్యర్థిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కిలేశపురం(ఇబ్రహీంపట్నం): వైఎస్సార్ సీపీతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకులు కర్ర హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు సోదరుడు సర్నాల స్వామి, జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, వీరులపాడు జెడ్పీటీసీ అమర్లపూడి కీర్తి సౌజన్యతో కలిసి కిలేశపురంలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజా సంక్షేమం కోసం వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, ఎమ్మెల్యే సర్నాల తిరుపతిరావుకు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. మండల కన్వీనర్ బొంత సాంబశివరావు, వైస్ ఎంపీపీ బాణావత్ నాగబాలమ్మ, దుర్గగుడి పాలకవర్గ సభ్యుడు చింకా శ్రీనివాసరావు, బాణావత్ బాలాజీ, నాయకులు పాల్గొన్నారు.

స్థానికుడు సర్నాలను గెలిపించండి



కొత్త మంగాపురం(మైలవరం): మీ వాడు, మీలో ఒకడైన వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావును గెలిపించాలని ఆయన సతీమణి సర్నాల నాగలక్ష్మి గ్రామస్తులను కోరారు. మైలవరం మండలం పుల్లూరు శివారు కొత్త మంగాపురం గ్రామంలో శనివారం నాగలక్ష్మి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేస్తూ వైఎస్సార్ సీపీ అభ్యర్థి తిరుపతిరావును గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి జగనన్న ఒక సామాన్యుడిని గుర్తించి మైలవరం అభ్యర్థిగా ప్రకటించారని, తిరుపతిరావును గెలిపించి జగనన్నకు కానుకగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలి



తుమ్మలపాలెంలో సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేస్తున్న జ్యేష్ఠ శ్రీనాథ్, తదితరులు

తుమ్మలపాలెం(ఇబ్రహీంపట్నం): రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే జ్యేష్ఠ రమేష్‌బాబు తనయుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు జ్యేష్ఠ శ్రీనాథ్ ప్రజలను కోరారు. మండలం పరిధిలోని తుమ్మలపాలెం గ్రామంలో శనివారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇప్పటి వరకు గ్రామంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థిగా కేశినేని నాని, ఎమ్మెల్యే అభ్యర్థిగా సర్నాల తిరుపతిరావును గెలిపించుకుంటే మరిన్ని సంక్షేమ పథకాలు అమలు జరుగుతాయన్నారు. వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ చింతల చిట్టిబాబు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మద్దులపర్వలో మణికంఠ ప్రచారం..

రెడ్డిగూడెం: మైలవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి సర్నాల తిరుపతిరావు తనయుడు సర్నాల మణికంఠ మద్దులపర్వ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి ఎమ్మెల్యేగా సర్నాల తిరుపతిరావును, ఎంపీగా కేశినేని శ్రీనివాస్(నాని)లను భారీ మేజార్టీతో గెలిపించాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

తిరుమలగిరి(జగ్గయ్యపేట): ప్రముఖ పుణ్యక్షేత్రం వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు శనివారం రాత్రి స్వామివారికి నిర్వహించిన పవళింపుసేవతో ముగిశాయి. అర్చకులు తిరునగరి రామకృష్ణమాచార్యులు పర్యవేక్షణలో స్వామివారికి చతుర్దశ, మహానివేదన, ద్వాదశ ప్రదక్షిణములు, పవళింపు సేవ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆరు రోజుల పాటు బ్రహ్మోత్సవాలను ఇన్‌చార్జ్ ఏసీ సాంబశివరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చివరి రోజు భక్తులు, గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారి ఉత్సవ మూర్తులను ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. మహిళలకు ఆలయ సాంప్రదాయం ప్రకారం పసుపు, కుంకుమ, జాకెట్, పండ్లు, ప్రసాదాలు అందించారు. అద్దాల మండపాన్ని పలు రకాల సుగంధ పుష్పాలతో అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది వెంకటేశ్వరరావు, రుక్మందరావు, శోభనాద్రి తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాల అమలు

ఎంపీపీ మెర్సీవనజాక్షి



బ్రోచర్లు అందజేస్తున్న ఎంపీపీ మెర్సీవనజాక్షి

విస్సన్నపేట: పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి అన్నారు. స్థానిక సిద్ధార్థ పాఠశాల ఏరియాలో తిరువూరు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు, ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని) విజయాన్ని కాంక్షిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ పేదల సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలన కొనసాగించిందని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, ఏఎంసీ డైరెక్టర్ రెడ్డి శేషగిరి, ఎంపీటీసీ సభ్యుడు గద్దల మల్లయ్య, సొసైటీ అధ్యక్షుడు రెడ్డి ముత్యాలరావు, మండల యూత్ అధ్యక్షుడు అలీరహమాన్, నాయకులు దస్తగిరి, కోటా శ్రీను, కోటా పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పాలిసెట్

తిరువూరు: ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులకు రాష్ట్ర సాంకేతిక విద్యా మండలి నిర్వహించే పాలిసెట్ పరీక్ష తిరువూరులోని పలు కేంద్రాల్లో శనివారం జరిగింది. మొత్తం 1,417 మంది విద్యార్థులను కేటాయించగా 1,196 మంది పరీక్షకు హాజరయ్యారు. 221 మంది గైర్హాజరయ్యారు. శ్రీ వాహినీ ఇంజనీరింగ్ కళాశాలలోని ఒకటో పరీక్ష కేంద్రంలో 82.3 శాతం, శ్రీవాహినీ కాలేజీ రెండో పరీక్ష కేంద్రంలో 84.5 శాతం, జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 86 శాతం విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.


లారీ ఢీకొని నాలుగు వాహనాలు ధ్వంసం



ఆగిరిపల్లి: మండలంలోని అడవినెక్కలం వద్ద లారీ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న వాహనాలను ఢీకొట్టడంతో నాలుగు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. వివరాలు.. ఈదరకు చెందిన గురుముచ్చు పండు లారీపై ఈదర నుంచి విజయవాడ వెళ్తుండగా అడవినెక్కలం గ్రామం వద్దకు రాగానే ఒక్కసారిగా బ్రేకులు ఫెయిలయ్యాయి. దీంతో రోడ్డు పక్కనే నిలిపి ఉన్న నాలుగు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో, విద్యుత్ స్తంభాన్ని లారీ ఢీ కొట్టి ఆగిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

బీటెక్ విద్యార్థులకు వీడ్కోలు

తిరువూరు: స్థానిక శ్రీ వాహినీ ఇంజనీరింగ్ కళాశాలలో నాలుగో సంవత్సరం బీటెక్ ట్రిపుల్ ఈ విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఇంజనీరింగ్ అర్హతతో వివిధ రంగాల్లో ఉపాధి అవకాశాలను కళాశాల ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు వివరించారు. రెండు రోజుల పాటు కళాశాలలో నిర్వహించిన సాంకేతికోత్సవంలో ఉత్తమ ప్రజంటేషన్లు అందించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కళాశాల చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఊటుకూరు సుబ్రహ్మణ్యం, కోశాధికారి కిషోర్, కరస్పాండెంట్ పోట్రు నాగేశ్వరరావు, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



రేపటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరం

నూజివీడు: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో ఈనెల 29 నుంచి జూన్ 7వ తేదీ వరకు విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తామని గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు తెలిపారు. శిబిరం నిత్యం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుందన్నారు. పుస్తకాలు చదివించడం, పుస్తక సమీక్ష, చిత్రలేఖనం, పేపర్ క్రాఫ్ట్, స్పోకెన్ ఇంగ్లిష్, చదరంగం, క్యారమ్స్, యోగా తదితర కార్యక్రమాలను విద్యార్థులకు నేర్పిస్తామని వివరించారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేత



ఆగిరిపల్లి: నూగుండపల్లికి చెందిన మల్లవల్లి లక్ష్మయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో లక్ష్మయ్య భార్య ప్రమీలకు పీఏసీఎస్ ఆధ్వర్యంలో తక్షణ సాయంగా పీఏసీఎస్ అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కందుల విక్రం, వైఎస్సార్ సీపీ నాయకులు వాకా సక్కేశ్వరరావు పాల్గొన్నారు.